ఆర్ డి టి

# ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం జూలై 2005

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

గుడ్డలకు అంటిన మురికిని వదలగొట్టేది నీరు మాత్రమే. అయితే తొందరగా గుడ్డలుతకడానికి డిటర్జెంట్లను వాడుతున్నాము. డిటర్జెంట్లు వాడడంవలన క్షణాల్లో గుడ్డలకంటిన మురికిని వదలగొట్టడానికి మాత్రమే డిటర్జెంట్లు ఉపయోగపడుతున్నాయి. గుడ్డలుతకడంలో ఉపయోగించే ఈ డిటర్జెంట్లలోని రసాయనాలు వాతావరణంలో నశించవు. ఇవి మురికి కాలువలద్వారా, నేలద్వారా, నీరుపారే నదులు వంకలలో కలుస్తాయి. ఈ రసాయనాలు నదులు, నీటి నిలువల్లో పేరుకుపోయి వాతావరణంలో కరుగని ఒక దళసరి పొరను ఏర్పరుస్తాయి. దీనివలన పర్యావరణ ప్రక్రియకు విఘాతం కలుగుతుంది. మనదేశంలో డిటర్జెంట్లు తలసరివాడకం సంవత్సరానికి 1960లో దాదాపు ఒక కేజి ఉంటే, 1995 నాటికి అది రెండింతలయింది. ప్రతి సంవత్సరం 5,700 కోట్ల రూపాయల డిటర్జెంట్ల వ్యాపారం జరుగుతోంది. అందుకే మార్కెట్లో అనేక రకాల పౌడర్లు, సబ్బులు పోటీలుపడి ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

❖ ❖ ❖ ❖

సీసాలలో దొరికే కూల్‌డ్రింక్‌ల కంటే, సీసాలు, ప్యాకింగుల్లో దొరికే పళ్ళరసాలు మేలు అనుకుంటూ ఉంటాము. వీటిలో కేవలం 10 శాతం మాత్రమే పళ్ళరసాలుంటాయి. మిగతా 90 శాతంలో నీరు, చెక్కర ఉంటాయి. పళ్ళరసాలు సీసాల్లో నిలువ ఉంచడానికి రసాయనాలు కలపడంవల్ల వాటిల్లో దొరికే సి. విటమిన్లు నశిస్తాయి. పళ్ళ రసాల సంగ్రహణలోవాడే రసాయనాలవల్ల, అవి తాగినపుడు కడుపులో అసౌకర్యం కలుగుతుంది. ఎక్కువ కాలం నిల్వ ఉండడానికి వాడే సల్ఫర్ డయాక్సైడ్, సోడియం బెంజోట్‌లాంటి రసాయనాలవల్ల ఆస్థమా రోగులకు ఛాతి బిగుతుగా పట్టినట్లు అనిపిస్తుంది. గొంతులో నస, చర్మం మీద దద్దుర్లు వస్తాయి.

(డౌన్ టు ఎర్త్, మే 31, 2005 నుండి)

**చిట్కా :** చక్కెర వ్యాధిగలవారు కాకర గింజలను వేపుడు చేసి మెత్తని చూర్ణంగా చేసి, ఒక తులం పొడిని నేరేడు చెక్కర రసంతో కలిపి చిన్న కప్పునిండా రోజూ ఉదయాన్నే తాగి, ఆ తరువాత మీగడ తీసిన పాలు తాగితే చక్కెర వ్యాధి తగ్గు ముఖం పడుతుంది.

## కరువుకు ఎదురొడ్డి పోరాడడం నేర్చుకోవాలి. కరువును జయించి బతకడం అలవాటు చేసుకోవాలి.

మన జిల్లాలో కరువు ఒక అలవాటుగా వస్తున్న విషయం మనకందరికీ తెలుసు. కరువు మన జీవితాలతో ఏవిధంగా ఆడుకుంటున్నదో కూడా తెలుసు. వేసిన పంటలు నష్టం లేకుండా ఇంటికి రావడం అనేది ఋతుధర్మాలపైన ఆధారపడి ఉంటుంది. వేసిన పంటలన్నీ నూటికి నూరుపాళ్ళు ఇంటికి చేరుతాయని ఏ రైతు నమ్మకంగా చెప్పలేడు. అయితే సంవత్సరానికి రెండు, మూడు పంటలు పండించేవాళ్ళకు ఒక పంట పోయినా, మరో పంట మిగుల్తుంది. ఉదాహరణకు సంవత్సరానికి రెండుమూడు పంటలు పండే సర్కారు జిల్లాలో కూడా తీరా పంట చేతికొచ్చేటపుడు విపరీత వర్షాలతో వరదలొచ్చి పంట తుడిచిపెట్టుకుపోవడం కద్దు. అయితే మరొక పంట అయినా లాభసాటిగా పండే అవకాశము వుంది. కాబట్టి రైతు తట్టుకోగలడు. అయితే మన జిల్లా కొచ్చేసరికి మనకు పండే పంటంతా సంవత్సరానికంతా ఒకే పంట. ఆ ఒక్క పంట ప్రకృతి కారణాలవల్ల పండక పోతే కరువు కిందే లెక్క. మరొక సంవత్సరం వరకూ, రైతు పాత కోరికలు, కొత్త కోరికలతో ఎదురుచూడాల్సి వస్తుంది. దీన్ని కొంత వరకు ఎదుర్కోవడానికే గతంలో మనవాళ్ళు లెక్కకు మించిన కాలువలు, తలిపిరులు, చెరువులు, కుంటలు నిర్మించారు. ఒకవేళ అదునులో వర్షాలు కురవక, తరువాత వర్షాలు కురిసినా, మెట్టపంటపోతుంది. అయితే చెరువులకు, కుంటలకు నీళ్ళు వస్తే, కొంత వరకు తిండి గింజలు పండుతాయి. పశువులకు గడ్డి వస్తుంది. ఇది కరువును జయించడానికి మనవాళ్ళు అనుసరించిన ఒక ప్రక్రియ. అంటే ఏదైతే మనకు అనానుకూలంగా ఉంటుందో దానిని జయించేమార్గాలు వెతకడమన్నమాట.

రైతులను ఆదుకోవడం, వ్యవసాయాన్ని కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత. అయితే అన్ని సమస్యలు ప్రభుత్వాలే తీరుస్తాయనుకోవడం సరయిందికాదు. లేదా కరువు-కరువు అని మనం ఏకరవు పెట్టినంతమాత్రాన కూడా మన సమస్యలు తీరవు. అలా తీరేదట్లా ఉంటే, ఇన్నేళ్ళ నుంచి మనం కరువు కరువు అని అరుస్తున్నా కరువు పోవడం లేదు. మనల్ని పట్టి పీడుస్తూనే ఉంది. గతంలో ఈ విషయమై చాలాసార్లు చర్చించుకున్నాం. అయినా అవసరమయిన విషయాలు మళ్ళీ, మళ్ళీ, మాట్లాడుకున్నా తప్పులేదు.

నీటి వసతి లేకపోవడం, వర్షాలు సకాలంలో కురవకపోవడం మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. అయితే నీటి వసతి కలిగి పంటలు పండిన ప్రాంతాల రైతులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానమైనవి. గిట్టుబాటు ధరలు లేకపోవడం. పంటనుకొనేవారు లేకపోవడం. బాగా పండిన మిర్చి పంటకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇవి. పంటకు సరిఅయిన గిట్టుబాటు ధరలేక పోవడమంటే, పంట ఉత్పత్తి ఖర్చుకంటే, పంట ధరలు తక్కువగా ఉండడం. ఈ సంక్షోభానికి కారణం మన మిర్చిలో పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని విదేశాలు కొనడానికి నిరాకరించడం. పండడమే సమస్య అయిన మన జిల్లాలో

→

“భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది” ఉపనిషత్తులు

పండిన తరువాత వచ్చే కొన్ని గుణపాఠాల్ని కూడా మనం తీసుకోక తప్పదు. స్థూలంగా విశ్లేషిస్తే, పంటపెట్టుబడులు గణనీయంగా తగ్గించుకోవాలి. రసాయనిక మందుల వాడకం తగ్గించుకోవాలి. మిర్చి రైతులకు వర్తించే ఈ రెండు సూత్రాలు మనకూ వర్తిస్తాయి. సకాలంలో వర్షాలు కురిసి వేరుశనగ పండినా, ఎకరాకు కనీసం రూ. 500- నుంచి 1000 వరకు నష్టం వస్తున్నదని, రైతు వేరుశనగ పండించడం తమకోసం కాదు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారులకోసం, వేరుశనగ వ్యాపారుల కోసం పండిస్తున్నారని వ్యవసాయ రంగ నిపుణులు లెక్కలు వేసి మరీ చెప్తున్నారు. ఇక వరుసగా పంటలు పోతే, ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న సంక్షోభమే మనకు గతి. అందుకు మనం అత్యవసరంగా ఆలోచన చెయ్యాలి. ఖర్చు తగ్గించడమెలాగో ఆలోచించాలి. ఆలోచిస్తే రైతులకు తెలియనిదేమీలేదు.

## 1) వేరుశెనగ విస్తీర్ణాన్ని తగ్గించాలి.

ఈ సంవత్సరం కనీసం మూడు భాగాల్లో ఒక భాగానికైనా వేరుశనగ పంట తగ్గించాలి. అంటే అయిదు ఎకరాలు వేరుశనగ వేసే రైతు మూడెకరాలు మాత్రమే వేసి రెండు ఎకరాలకు వేరే పంటలు వేయాలి. జొన్న, కంది, ఆముదాలు వేయవచ్చు. వేరుశనగలో అక్కిళ్ళు వేసి, అలసంద, పెసర, సద్ద, కంది విత్తనాలు వేయాలి. ఈ చిన్న పంటలకు పెద్దగా ఆదాయం కనపడదు. కాబట్టి మన దృష్టి దానిమీదకి మళ్ళదు. కానీ ఈసారి ఈ పంటలు వేసి, పండిన తరువాత వాటిని కూడా లెక్కవేసి చూడండి. ఖర్చు-ఆదాయాల్ని గమనించండి. జొన్న, సద్ద, పంటలవల్ల పశువులకు మేత వస్తుంది. ఆముదాలు, కందులకు మంచి రేటే వస్తుంది. ఇక అలసందలు, పెసరపప్పు ధాన్యాలుగా శ్రేష్ఠమైనవి. కందులు అమ్ముకున్నా మిగతావి ఇంటికి తినడానికి ఉంచుకోవచ్చు. జొన్నలు సద్దలు అమ్మకుండా ఇంటికే తినడానికి ఉపయోగించాలి. దీనివలన ఒక రైతు కనీసం తన కుటుంబ అవసరాలకు 50 శాతం తన పొలం నుంచే తీసుకోవడం అలవాటు చేసుకున్నట్లవుతుంది.

ఇక వేరుశెనగను తీసుకుందాం. విత్తనం దగ్గర నుంచే ఇది రైతుకు పెనుభారం. కాబట్టి రసాయనిక ఎరువులు బాగా తగ్గించాలి. సాధ్యమయినంత వరకూ పశువుల ఎరువులు, సేంద్రీయ ఎరువులు వాడాలి. పురుగు మందులకు బదులుగా ఎన్నో ప్రత్యామ్నాయ మార్గాలు ఇదే సమాచార పత్రిక ద్వారా సూచించాం. ఈ సందర్భంగా ఒక విషయాన్ని మనం ప్రస్తావించుకోవాలి. జూన్, 28 తేదీ 2005 "ఇండియాటుడే" తెలుగు పక్ష పత్రికలో "కోస్తా జిల్లాల్లో నిశ్శబ్ద విప్లవం" అన్న పేరుతో ఒక వ్యాసం అచ్చయింది. దాని సారాంశమేమంటే ఎక్కువగా పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడే కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరుల నాలుగు జిల్లాల్లోని 4.8 లక్షల ఎకరాల సాగుభూమిలో దాదాపు 80 వేల ఎకరాలకు పైగా భూములను సేంద్రీయ వ్యవసాయానికి మార్చుకున్నారు. వానపాముల ఎరువుల్ని స్వయంగా ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఈ వసతి లేనివారు ఇతరులతో కొనుక్కుంటున్నారు. గతంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులకు ఎకరాకు సుమారు రూ.1370/- ఖర్చయితే ప్రస్తుతం అందులో సగం కూడా ఖర్చు కావడంలేదట. దిగుబడి మాత్రం గతంలో ఎంత ఉందో, ఇప్పుడూ అంతే ఉందట. అంటే ఉత్పత్తి వ్యయం సగానికి సగం తగ్గిందన్నమాట, ఉత్పత్తి వ్యయం తగ్గినపుడు సహజంగానే రైతుకు ఆదాయం పెరుగుతుంది. ఆదాయం పెరిగినపుడు ధరల్లో తేడా వచ్చినా రైతుకు పెద్దగా నష్టం ఉండదు. మరొక విషయమేమిటంటే సహజ ఎరువులద్వారా పండించిన ఆహారధాన్యాలు, కూరగాయలకు మార్కెట్లో బాగా డిమాండ్ ఉంది. రేటుకూడా కొంచెం పెరుగుతుంది. మనం కూడా ఈ రకంగా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలి. పూనుకుంటే సాధ్యం కానిదేమీలేదు. సేంద్రీయ ఎరువుల వాడకంవల్ల రోగాల ఉధృతి కూడా తగ్గిందని చెబుతున్నారు.

## 2) పశువుల మేత - పాడి పశువులను పెంచుకోవడం.

మనం వేసే పంటల్లోనే పశువుల మేత ఎక్కువగా వచ్చేటట్లు పంటలు వేసుకోవడంతోపాటు, ఎక్కడైనా నీరు దొరికే చోట వ్యక్తులుగా గానీ, సామూహికంగా కానీ, మేతజొన్న వేసుకొని పశువుల మేత జాగ్రత్తపర్చుకోవాలి. గత 4-5 సంవత్సరాలుగా మనం తీవ్రమైన పశువుల మేత కొరతను ఎదుర్కొంటున్నాం. దప్పికయినపుడు బావి తవ్వుకునే ప్రయత్నంకంటే, ముందే దప్పికను ఊహించుకుని నీటిని దాచుకున్నట్లుగా, ప్రత్యేకంగా గడ్డి దాచుకునే ప్రయత్నం చేయాలి. కనీసం ఇంటికి ఒకటి లేదా రెండు పాడి పశువులు ఉంచుకుంటే పాల ఆదాయంవల్ల కనీసం కుటుంబ పైఖర్చులయినా తగ్గుతాయి. పైగా ఎరువు చేనుకు ఉపయోగపడుతుంది. ఎరువుల ఖర్చులు ఉండవు. ఖాళీ సమయాల్లో దిబ్బలు పెంచుకునే ప్రయత్నాలు చెయ్యాలి. ఎంతమేరకు పంట పెట్టుబడులు తగ్గించగలమో లెక్కలు వేయాలి. ఈ విధంగా రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగుమందులు వాడకం తగ్గించుకుంటూపోతే, తెగుళ్ళ ఉధృతి తగ్గుతుంది. ఖర్చులు తగ్గుతాయి. నీటి వసతి ఉన్నవారు కొంత భాగంలో రెండు-మూడు తడులు పారించి మేత గడ్డిని పెంచుకోవాలి. పశువులు, పాడి లేకుండా వ్యవసాయం ఒక్కటే చేయటం భారమని మనం ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలి.

## 3) ఇతర ఆదాయ మార్గాలు

సాధ్యమయినంతవరకూ వారి వారి స్థోమత, అనుకూలాన్ని బట్టి, గొర్రెలు, మేకల్ని పెంచుకోవాలి. ఏ మార్కెట్టుకు ధోకా ఉన్నా, వీటి మార్కెట్టుకు మాత్రం ధోకా ఉండదు. ఒక రకంగా చూస్తే వీటిని గనుక జాగ్రత్తగా కాపాడుకుంటే మంచి ఆదాయమే వస్తుంది. అట్లాగే నీటి వసతి తక్కువగావున్న భూములలో కూడా నాలుగయిదు రకాల కాయగూరలు, ఆకుకూరలు పండించడం అలవాటుగా మార్చుకోవాలి. ప్రస్తుతం చాలామంది రైతులకు వానపాముల ఎరువుల మీద ఆసక్తి పెరుగుతోంది. కారణం, మార్కెట్లలో దొరికే రసాయనిక ఎరువులకంటే, ధర తక్కువగా ఉండడం. వీటి ఉత్పత్తికి పెద్దగా ఖర్చు ఉండకపోవడం. ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి చేస్తే స్వంతానికి ఉపయోగపడడమే కాకుండా అమ్మకానికిగూడా మంచి గిరాకి ఉంటుంది. మంచి ఆదాయంగా కూడా ఉంటుంది.

ఇవి అన్నీ ఏ మాత్రం కష్టం లేకుండా, అంత సులభంగా రావు. మనసు లగ్నం చేయాలి. పట్టుదలలు పెంచుకోవాలి. మనమెందుకు బాగుపడకూడదూ అన్నపట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది. అపుడే బరువుగామారిన వ్యవసాయాన్ని తేలికపర్చుకోగలం. మనల్ని భయపెడుతున్న కరువును జయించగలం.

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి**

## నీతి వాక్యం :

చ|| జలజపరంపరన్ సురిచిసంపద నింపు నినుండు, కైరవో
త్పలనికరంబులన్గరము భాసిలcజేయు సుధాంశుc, దంబుదా
వళితనయంతc దాc గురియు వర్షము హర్షముc జెంద లోక, మి
ట్లలఘుమతుల్ స్వయంగత పరార్థహితుల్ సుకృతుల్ దలంపcగన్

-భర్తృహరి

**తాత్పర్యము :** ప్రార్థించకుండానే సూర్యుడు పద్మాలను వికసింపజేస్తాడు. ప్రార్థించకుండానే చంద్రుడు కలువలను వికసించేలా చేస్తాడు. మేఘుడు అడగకుండానే జలాన్నందిస్తాడు. అలాగే సత్పురుష లెప్పుడూ అడగకుండానే ఇతరులకు మేలు చేయడానికి ఇష్టపడతారు.

**చర్చ :**

ఇందులో సారాంశమంతా ఏవిధంగానైతే సూర్యుడు అడగకుండానే పద్మాలను వికసింపజేస్తాడో, ఏ విధంగానైతే చంద్రుడు కలువలను వికసింపజేస్తాడో అలాగే సత్పురుషులెప్పుడూ అడగకుండానే ఇతరులకు మేలు చేయడానికి ఇష్టపడుతారని భర్తృహరి మంచి మనుషులను సూర్య, చంద్రులతో పోలిక తెస్తున్నాడు. సూర్యునివల్ల పద్మాలు వికసించినా, చంద్రునివల్ల కలువలు వికసించినా అవి అన్నీ ప్రకృతి ప్రేరేపణలే. ప్రకృతి ధర్మాలే. ఈ ప్రకృతిలో మనిషి ఒంటరి కాదు. పూర్తిగా స్వేచ్ఛా జీవికూడా కాదు. ప్రకృతి నియమాలననుసరించి, మనిషి కూడా ప్రకృతి ధర్మాలు పాటించాలి. ఒంటరికాదని అనడంలో ఈ ప్రకృతిలో మానవుడొక్కడే కాదు, అనేక ఇతర ప్రాణి, పక్షిజాతులున్నాయని. స్వేచ్ఛా జీవికాదనడంలో, మనిషి తన ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించకూడదని. ప్రకృతి నియమాలననుసరించే ప్రవర్తించాల్సి ఉంటుందని. ప్రకృతి నియమాలను అనుసరించడమంటే, తాను బతకడానికి అవసరమైనంత మేరకు మాత్రమే ప్రకృతి వనరుల్ని ఉపయోగించాలని. తాను చేసే ప్రతి పనీ, ప్రతి చర్య ప్రకృతిని అభివృద్ధి చేయడానికే గానీ, వినాశనానికి హేతువులు కాకూడదు. మరింత లోతుగా ఆలోచిస్తే ఈ భూమ్మీద మనకు చంపవలసిన శత్రువులు కానీ, నాశనం చేయాల్సిన సంపద, వనరులు కానీ ఉండరాదు. ఎందుకంటే చంపడం, నాశనం చేయడం అన్నీ ప్రకృతి విరుద్ధాలే. అందుకే సత్పురుషులైన వారంటే జ్ఞానులుగా భావించాలి. కాబట్టి వారు ఇతరులకు సహాయం చేయడం తమ విధిగా భావిస్తారు. అంటే మనిషిగా తమ సహజ ధర్మాలను పాటిస్తున్నట్లు లెక్క. ఎవరి ఆదేశాలు లేకనే వానపాములు వ్యర్థాల్ని తీసుకుని భూమిని గుల్లగా మార్చి భూమిని సారవంతం చేస్తాయి. భూమి మీద పడే ఆకు అలుముల్ని ప్రకృతి వ్యర్థాల్ని కీటకాలు ఎరువుగా మార్చి, చెట్లకు పంటలకు సత్తువను చేకూరుస్తాయి. పంట గింజలకు హానిచేసే పురుగుల్ని పట్టి తిని పక్షులు రైతుకు మేలుచేస్తాయి. ఇవన్నీ కూడా ప్రకృతి తమకు ఆదేశించిన నియమాల ప్రకారం పనిచేస్తాయి. అయితే మనుషులైన మనం ప్రకృతి నియమాల్ని అనుసరిస్తున్నామా? ప్రకృతి నియమాల్ని అనుసరించడమంటే ఒక సుప్రీం అధికారి ఆదేశాలను పాటించడంలాంటిది కాదు. ప్రకృతి నియమాల్ని అనుసరించడమంటే మనం చేస్తున్న పనివల్ల తోటి ప్రాణులు పశువులు, పక్షులు చెట్లు కొండలు, నదులు, సముద్రాలకు విఘాతం కలగకుండా ఉండడం. కానీ మనం అత్యాశతో అడవుల్ని నరికి వేస్తున్నాము. ప్రాణకోటికి జీవనాధారంగా ఉండాల్సిన నదుల్ని, వంకలు, కాలువల్ని, సముద్రాల్ని కలుషితం చేస్తూ ఇతర ప్రాణులు బతకడానికి అవకాశం లేకుండా చేస్తున్నాము. రసాయనిక పురుగు మందులు వాడి సహజ సిద్ధమైన మిత్ర పురుగుల్ని, పక్షుల్ని చంపుతున్నాము. ఆఖరికి అసూయాద్వేషాలతో మనుషుల్నే చంపుకుంటున్నాం. ఆస్తుల్ని, చెట్లను, పంటల్ని తగులబెడుతున్నాం. చివరికి భస్మాసురుడు తన నెత్తిమీద తానే చేయిపెట్టుకున్నట్లుగా వ్యవహరిస్తున్నాం. అందుకే సూర్య చంద్రుల్ని చూపి, మనల్ని బాధ్యతగా, మంచిని మాత్రమే పంచగల సత్పురుషులుగా వ్యవహరించమంటున్నాడు భర్తృహరి.

వై.వి. మల్లారెడ్డి

## సేంద్రియ వ్యవసాయంలో లాభాలు

రసాయనాలు, పురుగుమందులు, క్రిమి సంహారకాలు, శిలీంద్రనాశినులు మొదలైన కృత్రిమ వనరుల వాడకాన్ని నిరోధించి వాటికి బదులుగా సహజవనరులైన పంటల అవశేషాలు, పెంట ఎరువులు, పప్పుధాన్యాల అవశేషాలు, పచ్చి రొట్టలు, సేంద్రీయ వ్యర్థాల వాడకం, పంట మార్పిడితోపాటు వివిధ యాజమాన్య పద్ధతులద్వారా భూసారాన్ని పెంచి, ప్రకృతి సిద్ధమైన ఉపయోగకర కీటకాల ద్వారా చీడపీడలను నియంత్రించే పద్ధతినే "సేంద్రీయ సేద్యం" అంటారు. నేల, నీరు, మొక్క, సూక్ష్మజీవుల మధ్య సమగ్ర పరస్పర సంబంధాన్ని పెంపొందించడం సేంద్రీయ సేద్యం ముఖ్య ఉద్దేశ్యం.

సేంద్రీయ సేద్యంలో ఖరీదైన రసాయన ఎరువుల వాడకం తగ్గించడంవల్ల పంట పెట్టుబడి ఖర్చు తగ్గటమేకాక, పోషక విలువలను కలిగిన సేంద్రీయ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా దేశాల మధ్య పరస్పర సంబంధ బాంధవ్యాలను పెంచవచ్చు. అంతేకాక పర్యావరణాన్ని కాలుష్యం బారినుంచి కాపాడి ఆహార భద్రతను కూడా పెంచుకోవచ్చు. అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చు. సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించడం వల్ల భూసారాన్ని కాపాడుకోవచ్చు తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి.

### 1. భూసార పరిరక్షణ :-

పశువుల పెంట, పచ్చిరొట్ట, కంపోస్టు వాడకం పెంచి రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తే నేలలోని సేంద్రియ పదార్థం పెరిగి తద్వారా నేలలోని సూక్ష్మక్రిములు, జీవకారకాలు పెరుగుతాయి.

### 2. నీటి పరిరక్షణ :-

సేంద్రీయ సేద్యం వల్ల నేలలో అధికంగా సేంద్రీయ పదార్థం ఉండటంవల్ల నీరు నేలలోకి సులువుగా చొచ్చుకుపోయి, నీటిని పట్టి నిల్వ వుంచే శక్తిని పెంచుతుంది. పోషకాలు పెరగటమే కాక, చౌడు భూములు ఏర్పడటాన్ని అరికట్టవచ్చు.

### 3. ఆహారభద్రత :-

సేంద్రీయ సేద్యంవల్ల పంట నష్టాలు తగ్గి, దిగుబడి పెరుగుతుంది. సంవత్సరం పొడవునా వచ్చే దిగుబడులవల్ల ఆహార కొరత ఉండదు. ఈ విధానం పేద రైతులకు కొంత ఊరట కల్గిస్తుంది. అదనపు ఆదాయ అవకాశాలు పెరుగుతాయి.

### 4. సురక్షిత ఆహారం :-

జీవసాంకేతిక విధానాల ద్వారా చీడపీడలను తగ్గించడం, రసాయన ఎరువుల వాడకం లేనందువల్ల వాటి అవశేషాలు, రోగకారకాల ప్రభావం పంటలపై ఉండదు. ఆరోగ్యానికి హాని కలుగజేసే అవకాశాలు తగ్గుతాయి. సురక్షిత పంటలను పొందవచ్చు.

### సేంద్రియ సేద్య ఉత్పత్తులవల్ల లాభాలు :

1. ఆహార నాణ్యత, రుచి పెరుగుతాయి.
2. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, పోషకాలు, క్యాన్సర్‌ని నిరోధించే ఏంటీఆక్సిడెంట్‌ల పరిమాణం పెరుగుతుంది.
3. పర్యావరణం కాలుష్యరహితంగా ఉంటుంది.

**(అన్నదాత జూన్ 2005 ఆధారంగా)**

# ఈ మాసంలో వ్యవసాయం

## మెట్టభూములలో వేరుశనగ సాగులో చేపట్టవలసిన కొన్ని ముఖ్యమైన మెళకువలు

వయ్యారిభామ, ఎన్నొద్దలాకు, ఉత్తరేణి తదితర రకాలు పూమొక్కలను సమూలంగా రైతులు యిదివరకే నిర్మూలించి ఉంటారు. లేని పక్షములో ఇప్పుడైననూ చేపట్టాలి. ఎకరము విస్తీర్ణములో తగినన్ని అనగా 1,32,000 మొక్కలుండాల్సిన టి.యం.వి.2, వేమన రకాలు విత్తే దూరం 30 సెం.మీ. × 10 సెం.మీ. ఉండాలి. విత్తనపు మొలక శాతాన్నిబట్టి 40-48 కేజీలు అనగా ఎకరాకు 50 నుండి 60 శేర్లు విత్తనం అవసరం.

### విత్తన శుద్ధి :

ప్రతి కిలో వేరుశనగ విత్తనమునకు 4 గ్రాముల ట్రైకోడర్మా విరిడితో విత్తన శుద్ధి చేయుట వలన, మొదలు కుళ్ళు, కాండము కుళ్ళు, తెగుళ్ళకు కారణాలైన శిలీంధ్రాలు మొక్కలకు వ్యాపించకుండా చేస్తుంది. ఈ శిలీంధ్రనాశనితో విత్తన శుద్ధి చేయుటవలన దానిలోనున్న శిలీంధ్ర సిద్ధబీజాలు మొలకెత్తి మొక్కలో నిల్వ ఉండి, మొక్కలోని హాని చేయు శిలీంధ్రాల వ్యాప్తిని పంట తీసే వరకు జరగనీయవు.

### వేరు పురుగు :

వేరుపురుగు ఉన్న పొలమునకు ఎకరమునకు 200 కేజీల వేపచెక్క చొప్పున వేసి కలియదున్నిన వేరుపురుగు కొంతవరకు నివారించుటేగాక భూమికి ముఖ్యమైన ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది.

వాలుకు అడ్డంగా విత్తాలి. ఎట్టి పరిస్థితులలోనూ వాలుకు అనుకూలముగా విత్తరాదు.

అంతర పంటగా 7 లేక 11 సాళ్ళకు ఒక సాలు కంది, అలసంద కలిపి విత్తుకోవాలి.

మేరచుట్టూ సద్ద, అలసంద కలిపి 4 సాళ్లు విత్తుకోవాలి. ఇందలి సద్దతో వేరుశనగ కాండము కుళ్ళు కలుగజేయు వెర్టి తెగులు బీజాలు గాలి తాకిడికి వేరుశనగ పైరుపై పడకుండా అడ్డంగా తడికె మాదిరి ఉంటుంది. ఆ విధంగా ఉండాలంటే సజ్జ + అలసంద విత్తనంతోపాటు విత్తు సమయములో 20:20 కాంప్లెక్సు ఎరువు కలిపి విత్తితే సద్ద తొందరగా ఏపుగా పెరిగి ఆశించిన ఫలితం దక్కుతుంది. ఒక హెక్టారు అనగా 2.50 ఎకరాల విస్తీర్ణానికి మేర 4 సాళ్ళు చొప్పున వేయుటకు 200 గ్రా॥ సద్ద, 325 గ్రా॥ అలసంద మరియు 2 కేజీల 20:20 కాంప్లెక్సు కావాల్సి ఉంటుంది.

మేరసాళ్ళలో మరియు అంతర పంటగా కందితోపాటు అలసంద విత్తుకుంటే అలసంద వేరుశనగకన్నా ముందు మొలచి, ఎర్రగొంగళికి ఎరపంటగా ఉండి, గొంగళితల్లి రెక్కల పురుగు అలసంద ఆకుల అడుగుభాగాన గ్రుడ్లు పెడుతుంది. రైతులు ఆ గ్రుడ్ల సముదాయాన్ని గుర్తించి నాశనము చేయుటకు వీలు కలుగుతుంది.

### గొడ్డుసాలు :

వేరుశనగ విత్తిన 10-15 రోజులకు ప్రతి 12-15 సాళ్ళకు రెండు సాళ్ళ మధ్య ఒక గొడ్డుసాలు ఏర్పాటు చేసుకొంటే పడిన వర్షపు నీరు గొడ్డుసాలులో నిలిచి భూమిలోనికి ఇంకుతుంది.

రైతులారా !

రసాయన పురుగు మందులు వాడకండి. జీవక్రిమి కీటక నాశనులను తయారు చేసుకొని ఉపయోగించండి.

- వేపగింజల కషాయం.
- వేపనూనె.
- వేపచెక్క.
- పచ్చిమిర్చి + వెల్లుల్లి.
- పొగాకు డికాక్షను.
- ఆవు పేడ + మూత్రం.

వివరములకు మీ గ్రామంలోనున్న యస్.టి.ఓను సంప్రదించండి.

## 'శ్రీ' వరి

బావుల క్రింద, బోర్ల క్రింద వరిసాగు చేసే రైతులు 'శ్రీ' పద్ధతిలోనే వరిసాగు చేయాలి. ఈ పద్ధతి వలన సాగునీరు ఆదా, ఖర్చు తక్కువ, అధిక దిగుబడి పొందవచ్చును. 'శ్రీ' వరి సాగుకు కలుపు తీయుటకు రోటరీ వీడర్లు వ్యవసాయ శాఖవారు అర్ధ ఖర్చుకు సరఫరా చేస్తారు. వీడర్లు కావలసిన రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్, హైదరాబాద్, వారి పేరిట రూ.500/- డి.డి.తీసి మీ మండల వ్యవసాయ అధికారికి ధరఖాస్తుకు జతపరచి సమర్పించవలసి ఉంటుంది.

### వరి పంటలో కన్పించే మిత్ర పురుగులు

| మిత్రపురుగు | నివారించే బెడద పురుగు |
|---|---|
| 1. సాలె పురుగులు | సుడిదోమ, పచ్చదోమ, తెల్లవీపుదోమ కాండంతొలుచు పురుగు, ఆకుముడత, వరిఈగ, కంపునల్లి, గొట్టాల పురుగు |
| 2. మిడతలు | వరి దోమగుడ్లు, కంపునల్లితల్లి, పిల్లపురుగులు |
| 3. బిళ్లపురుగులు | సుడిదోమ, కాండంతొలిచే పురుగు |
| 4. మిరిడ్‌నల్లి | సుడిదోమ, పచ్చదోమల గుడ్లు పిల్లపురుగులు |
| 5. తూనీగలు | సుడిదోమ, పచ్చదోమ, గొట్టాల పురుగు, తెల్లవీపుదోమ |
| 6. బ్రాకాన్ పరాన్నజీవి | కాండం తొలుచుపురుగు, వరిఈగ, గొట్టాలపురుగు |
| 7. టెలినోమస్ కందిరీగ | ఆకుముడత, కాండంతొలుచు పురుగులు గుడ్లు |
| 8. ట్రైకోగ్రామా పరాన్నజీవి | ఆకుముడత, కాండం తొలుచుపురుగు, దోమజాతులగుడ్లు |
| 9. న్యూక్లియర్ పాలీహెడ్రోస్ వైరస్ | రెల్లరాల్చుపురుగు గొంగళిపురుగు |

(అన్నదాత జూన్ 2005 ఆధారంగా)

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990